అటెన్షన్ ప్లీజ్



నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. బస్టాండ్‌లో బస్సుల కోసం గంటల తరబడి ప్రజలు ఊపిరి బిగపట్టాల్సి వస్తోంది. నీటి వసతి లేని కారణంగా మూత్రశాలలకు తాళాలు వేసి ఉంచుతున్నారు. ఈ విషయంపై అనేకసార్లు ప్రయాణికులు సిరిసిల్ల డీఎంకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. స్థానికంగా పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడం, ఉన్న బస్టాండ్ ఆవరణలో మూత్రశాలలు నిరుపయోగంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ డీఎం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల
ఫోన్ నంబర్: 99592 25929

చిత్రకథ



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ముస్తాబాద్: ముస్తాబాద్, మొర్రాయిపల్లె రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా వుంది. మొర్రాయిపల్లె ఎస్సీ కాలనీలో ప్రధాన రహదారిని అనుకుని వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచివుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ముస్తాబాద్ నుంచి మొర్రాయిపల్లె మీదుగా చీకోడు, ముచ్చర్ల వరకు ఇదే రహదారి వెంట ప్రయాణం సాగిస్తారు. రాత్రివేళల్లో అయితే వేగంగా వచ్చి పోయే వాహనాలతో ప్రమాదాలు జరుగుతాయని అంటున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు దూరంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మరమ్మతులేవీ?

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది, సేవాలాల్‌తండా గ్రామాల మధ్య ఉన్న రహదారి భారీ వరదకు కోతకు గురైంది. రెండు గ్రామాల మధ్య వున్న రహదారి పక్కనే ఒర్రె పారుతోంది. ఇటీవల భారీ వర్షాలకు ఒర్రె ఉధృతంగా ప్రవహించింది. దీంతో దారి కిందనే మట్టి కొట్టుకుపోయి కోతలకు గురైంది. ఎల్లమ్మ ఆలయం నుంచి రహదారి ఇలా మలుపు వద్దనే కోతలకు గురికావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

వాహన తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి ఎస్సై వి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని జిల్లెల్ల చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రయాణికులతోపాటు సరుకులు రవాణా చేస్తున్న వాహనాలను సైతం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రతి ఒక్క ప్రయాణికుడు ఎన్నికల నియమాలను అనుసరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లుతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సెకండ్ ఫేజ్ పాఠ్యపుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు జి.ఆరాదన ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెకండ్ ఫేజ్ పుస్తకాల పంపిణీలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ బాబు, ఉపాధ్యాయులు ఎం.శ్రీకాంత్, ఎస్.శ్రీనివాస్, టి.మల్లికార్జున్, పి.రజని, ఈ.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ బ్రిడ్జి నిర్మాణం కలేనా?

- మూడు మండలాల ప్రజలకు తప్పని ఇక్కట్లు
- ప్రతిపాదనలు బుట్టదాఖలు
- సర్వే చేసి చేతులు దులుపుకున్నారు

ఎల్లారెడ్డిపేట: మూడు మండలాలకు మార్గం సుగమం చేసే లేతమామిండ్ల వాగుపై వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్ ఉంది. దీంతో ఈ మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వంతెన నిర్మించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి శివారులోని లేతమామిండ్ల వాగుపై వంతెన నిర్మించాలని రెండేళ్ల క్రితం ప్రభుత్వానికి నివేదించారు. అధికారులు దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వేలు కూడా చేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో వంతెన నిర్మాణానికి మోక్షం లభించిందని అనుకున్న ఈ ప్రాంత ప్రజలకు నిరాశే మిగిలింది.

ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, వీర్నపల్లి మండలాల ప్రజలకు ఈ వంతెన నిర్మాణంతో వర్షాకాలంలో ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వంతెన నిర్మాణంలో జాప్యం కారణంగా వర్షాకాలంలో ఈ రహదారిలో ప్రయాణం చేయడం కష్టమే. కోనరావుపేట మండలానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. ఈ విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నదో ఇప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు జవాబు లేని ప్రశ్నగానే మిగిలిపోయింది.



వంతెన నిర్మించాల్సిన వాగు కల్వర్టు

తారు రోడ్డు వేసినా ఫలితం లేదు

ఎల్లారెడ్డిపేట నుంచి మరిమడ్లకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి అక్కపల్లి మీదుగా కోనరావుపేట మండలం మల్కపేట వరకు తారు రోడ్డు వేశారు. అటవీ ప్రాంతంలో దూరభారం తగ్గించేందుకు పెద్ద మొత్తంలో నిధులను వెచ్చించి రోడ్లు వేసినా వంతెన లేకపోవడం లోపంగా మారింది. లేతమామిండ్ల వాగు దాటితేనే అక్కపల్లి మీదుగా అటు కోనరావుపేట, ఇటు వీర్నపల్లి మండలాలకు వెళ్లేందుకు వీలుంటుంది. ఇలాం పరిస్థితిలో వంతెన లేక, వర్షాకాలంలో వాగులో నుంచి వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా మారింది.

వర్షాకాలంలో రాకపోకలు బంద్

అక్కపల్లి శివారులోని లేతమామిండ్ల వాగుపై వర్షాకాలంలో ప్రయాణాలు నిలిచిపోతాయి. పెద్ద ఎత్తున ప్రవహించే నీటి ప్రవాహంతో వాహనాలను దారి మళ్లిస్తారు. ప్రతి వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలకు ఇదే పరిస్థితి ఉంటుంది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రయాణికులు కలవరపాటుకు గురవుతున్నారు. కోనరావుపేట నుంచి వచ్చే వాహనాలను బుగ్గరాజేశ్వర తండా మీదుగా అల్మాస్‌పూర్ నుంచి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చేరే విధంగా చూస్తారు. ప్రతి వర్షాకాల సీజన్‌లో ఇదే పరిస్థితి ఉంటుంది. ఒక్కోసారి ఈ దారిలో కొత్త ప్రయాణికులు ప్రయాణించే సమయంలో నీటి ప్రవాహంతో పలుసార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. పాలకులు స్పందించి ఇప్పటికైనా వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి శాశ్వత పరిష్కారం చూపాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.



వర్షాకాలంలో ఇదీ పరిస్థితి

బ్రిడ్జి నిర్మించాలి



లేతమామిండ్ల వాగుపై వంతెన నిర్మించాలని రెండేళ్ల క్రితం ప్రభుత్వాన్ని కోరాం. వంతెన లేక తమ గ్రామంతో పాటు పక్క మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల మండలానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌ను కలిసి వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించాం. నిధులు కేటాయించి ఈ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చాలి.
– గోగూరి ప్రదీప్‌రెడ్డి, అక్కపల్లి

ఇబ్బంది పడుతున్నం



వాగుపై వంతెన లేక వర్షాకాలం వాగు దాటేందుకు ఇబ్బంది అవుతోంది. వంతెన ఆవశ్యకతపై అనేక సార్లు గ్రామసభల్లో పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. కల్వర్టుపై ఏర్పడ్డ గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నీరు పారకం వల్ల ఎక్కడెక్కడ గుంతలున్నాయో కనిపించడం లేదు. వాహనాలు రిపేరుకు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా చూడాలి.
– మందాటి బానుచందర్, అక్కపల్లి

ప్రతిపాదనలు పంపాం

అక్కపల్లి లేతమామిండ్ల వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాం. అంచనా వ్యయాన్ని కూడా తయారు చేశాం. అలాగే మండలంలోని నాలుగు రహదారుల్లో ఉన్న లోలెవల్ కల్వర్టులను గుర్తించి వాటిని శాశ్వతంగా బ్రిడ్జిలను నిర్మించాలని అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేశాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం.
– కిరణ్, ఏఈఈ, ఆర్అండ్‌బీ, ఎల్లారెడ్డిపేట

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: కొడిమ్యాల మండలం పూడూర్ 132/33 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పీఎంఐ (ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్) ఉన్నందున మండలంలోని మల్కాపూర్, కోరెం, స్తంభంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ జీ ప్రశాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సబ్‌స్టేషన్ల పరిధిలోని నల్లగొండ, తిప్పాయిపల్లి, మల్కాపూర్, తడగొండ, అనంతపల్లి, బూర్గుపల్లి, కోరెం, స్తంభంపల్లి, దుండ్రపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నియామకం

బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



నియామక పత్రం అందిస్తున్న హన్మండ్లు

ఎల్లారెడ్డిపేట: బీసీ సంక్షేమ సంఘం ఎల్లారెడ్డిపేట మండల ఉపాధ్యక్షుడిగా గుడ్ల శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మండ్లు నియామకపు పత్రాన్ని ఎల్లారెడ్డిపేటలో అందజేశారు. బీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న శ్రీనివాస్‌ను ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల అధ్యక్షుడు కంచర్ల రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి హన్మండ్లుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆఫీస్ లేదు.. అధికారి లేడు

- ఆమడ దూరం.. గిరిజన సంక్షేమం
- జిల్లా కేంద్రంలో ఏర్పాటు కాని కార్యాలయం
- ప్రగతి పనులకు దూరభారం
- జిల్లా గిరిజనుల పాలిట శాపం
- సంక్షేమ కార్యాలయ స్థాపనే పరిష్కారం

సిరిసిల్లకల్చరల్: రాజన్న జిల్లా కేంద్రంగా మారి ఏడేళ్లు అవుతోంది. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం అందుబాటులోకి వచ్చి రెండేళ్లు దాటుతోంది. అన్ని ప్రభుత్వరంగ కార్యాలయాలు ప్రజలకు ఒకేచోట అందుబాటులోకి వచ్చేలా ఈ సముదాయం సేవలు అందిస్తోంది. కానీ గిరిజన సంక్షేమ కార్యాలయం మాత్రం ఇంకా ఉమ్మడి కరీంనగర్ కేంద్రంగా తన సేవలను కొనసాగిస్తోంది. ఇక్కడి గిరిజనులకు ఇది దూరభారాన్ని, ఆర్థిక భారానికి కారణమవుతోంది. ఒక్క సీటు మాత్రమే కేటాయిస్తూ హైదరాబాద్ బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైతే, జిల్లాలోని 13 మండలాల్లోని అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు. పదుల సంఖ్యలో దరఖాస్తులు అందే ఈ ప్రక్రియలో సంబంధిత దరఖాస్తులను మాత్రం 40 కిలోమీటర్లు దూరంలో ఉన్న కార్యాలయంలో అందజేశారు.

వస్త్రోత్పత్తి కేంద్రంగా వాసికెక్కిన సిరిసిల్ల జిల్లాల పునర్విభజనలో భాగంగా జిల్లా కేంద్రంగా పరిణామం చెందింది. పాలన సౌలభ్యం కోసం జరిగిన ఈ పరిణామం ఉన్నతాధికారులను సామాన్య ప్రజలకు చేరువ చేసింది. ప్రజలకు మౌలిక వసతులు అందించే కీలక శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ రంగ శాఖలన్నీ జిల్లా కేంద్రానికి మారిపోయాయి. కానీ గిరిజన సంక్షేమ, అభివృద్ధి కార్యాలయం మాత్రం ఇంకా జిల్లాలో ఏర్పాటు కాకపోవడం ఇక్కడి గిరిజనుల పాలిట శాపంగా మారింది.



రెండేళ్లు గడిచినా.. ఇంకా కరీంనగర్‌లోనే

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంగా ఏర్పడి అన్ని ప్రభుత్వ శాఖలన్నీ సిరిసిల్లలో కొలువు దీరినా, కారణాలేవో కానీ గిరిజన సంక్షేమ కార్యాలయం ఏర్పాటు మాత్రం కలగానే మిగిలింది. దీంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని గిరిజనులు అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందాలనుకునే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. సుదూర ప్రాంతంలో ఉన్న కార్యాలయానికి చేరుకోవాలంటే దూర భారంతో పాటు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు.
జిల్లాలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, రుద్రంగి, మానాల తదితర ప్రాంతాల్లో గిరిజనుల జనాభా ఎక్కువ. వీర్నపల్లి లాంటి మండల కేంద్రంలో ఉన్న గిరిజనలు తమకు అవసరమైన పనుల కోసం సంక్షేమ కార్యాలయాన్ని సందర్శించాలంటే, ఒక్కరోజు మొత్తం కేటాయించాల్సిందే. రానూ పోనూ దాదాపు 160 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఒకటో తరగతిలో మిగిలిన ఒక్క సీటు కోసం లాటరీలో డ్రా తీస్తే వచ్చే ఒక్క సీటు కోసం ఆశావహులు అందరూ ఈ పని చేయాల్సిందే. ప్రయోజనం లేని పని కోసం వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి రావడం గిరిజనులకు విసుగు తెప్పిస్తోంది.

ఇవీ సమస్యలు..

సంక్షేమ అభివృద్ధి కార్యాలయం లేకపోవడంతో జిల్లా గిరిజనులు పలు సంక్షేమ పథకాలతో లబ్ధి పొందలేకపోతున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు సంబంధించిన నిధుల మంజూరులో జాప్యం జరుగుతోంది. వీటిని కూడా ఏజెన్సీ ప్రాంతాలకు మాత్రమే కేటాయిస్తున్నారు. పైగా నాన్ ఏజెన్సీ ప్రాంతాల నిధులను కూడా ఏజెన్సీలకే తరలిస్తున్నారు. ఉన్నత విద్యవైపు మొగ్గు చూపే గిరిజన విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాల దరఖాస్తులను సైతం ఉమ్మడి కరీంనగర్ కలెక్టరేట్‌లో మూడో అంతస్తులో ఉన్న కార్యాలయంలోనే సమర్పించాల్సి వస్తోంది. ఉపాధి కల్పన, పలు ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధిత శాఖ ఆధ్వర్యంలో అందించే ఉచిత శిక్షణ ప్రకటనలు సైతం కరీంనగర్ కార్యాలయం నుంచే జారీ అవుతున్నాయి. లబ్ధిదారుల దరఖాస్తులను అక్కడే సమర్పించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులైన యువత సుదీర్ఘ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ బాలుర వసతి గృహం కూడా జిల్లాలో ఏర్పాటు చేయకపోవడంతో ఉన్నత విద్యకు యువత దూరం అవుతున్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ కార్యాలయం లేకపోవడంతో వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యా సంస్థల్లో అధికారుల పర్యవేక్షణ ఉండడం లేదు. ఆశ్రమ పాఠశాలల పనితీరును పట్టించుకోవడం లేదు. అన్ని శాఖలు ఏర్పాటు చేసి గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని మాత్రం ఏర్పాటు చేయకపోవడం సంబంధిత వర్గాలకు శాపంగా మారింది. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ అభివృద్ధి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అల్లాడుతున్న జీవాలు



కోనరావుపేట: జీవాల్లో పశువుల, జీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన మండలంలోని కనగర్తి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పశువుల తొట్టి నిరుపయోగంగా మారింది. కొన్ని నెలలుగా నీళ్లు పట్టక పోవడంతో పశువులు దాహార్తితో అల్లాడుతున్నాయి. పాలకులు స్పందించి పవువుల తొట్టిని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన యువత

తంగళ్లపల్లి: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనానికి తంగళ్లపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివెళ్లారు.